# భూమికీ ఆకాశానికీ మధ్య

భూతలాన్ని వదిలి పెడుతున్నప్పుడు
అమ్మ అంతర్భాగం నుండి ఊడిపడుతున్న వేదనే
అన్ని రంగులు రుచులు
అంతరంగం సైతం మారినా
మరబొమ్మగా మరొకరి హస్తగతం అయినా
అంతరిక్షంలో అడుగు పెట్టబోతున్న ఆనందం
బొందితో స్వర్గానికేగుతున్నట్టే
బలీయమైన భూమ్యాకర్షణ పరిధిని కూడా దాటి
కక్ష్యలో పరిభ్రమిస్తున్నప్పుడు
భవబంధాల్ని కూడా దాటించమని
భూమాతకు భక్తితో ప్రదక్షిణలు చేస్తున్నట్టే.
తపస్సమాధిలో లీనమయినట్టు
నిర్దేశించిన అన్వేషణల్లో నిమగ్నమయినపుడు
కాలగమనం తెలియకపోయినా
దగ్గరున్నప్పుడు తెలుసుకోలేని రక్తస్పర్శానుభూతి
రహస్యంగా కట్టలు తెంచుకున్న ప్రవాహమే.
ఇన్నాళ్లకు ఇంటికి చేరుతున్నామన్న ఆనందం
అణువణువునా ఆక్రమిస్తున్నప్పుడు
ఒక్క తుఫాను తాకిడికి
ఊరు ఊరంతా అస్తవ్యస్తమయినట్టు
అర్థాంతరంగా ఆగిపోయిన ఆదేశాలు
హఠాత్తుగా తెగిపోయిన సంబంధాలు
దిక్కుతోచక గిజగిజలాడుతున్నప్పుడు
ఖగోళానికంతా పెద్దమ్మలా కనిపించిన
కన్నతల్లి అంగాంగాలను
తోబుట్టువులంతా

ఖండ ఖండాలుగా పంచుకుంటున్నట్టు
అన్ని దిక్కులా గుప్పుమంటూ గుండెలు పిండే వార్త.
ఎవరి యాతనలో వారున్నప్పుడు
కంటి ముందటి కిరాతకాలు కూడా కదిలించవు
ఎక్కడో అంతరిక్షంలో ఎవరేమైతేనేం?
మళ్లీ తెచ్చుకునే వరకూ బహుశా
విసిరేసిన ఆటబొమ్మకూడా పడేసిన చోటనే ఉంటుంది.

(సోవియట్‌రష్యా ఛిన్నా భిన్నమయినపుడు అగమ్యగోచరంగా వ్యోమగామి అంతరిక్షంలోనే గడిపినప్పుడు)